విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
20-12-2025
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 108

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# పంచాయితీలకు సెలవ్.. పెట్టండి



ఎంపిటిసి,జడ్పీటిసిలకు ప్రిపేర్ కండి

గులాబీ జెండాను హత్తుకున్న ప్రజలు

ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి

గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కెటిఆర్

**రాజన్నసిరిసిల్ల: ప్రభాత సూర్య :** పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా

2లో

## వికారాబాద్ జిల్లాలో దారుణం

- కట్టుకున్న భర్తే కాలయముడయ్యాడు
- ప్రేమించి పెళ్లి చేసుకుని కట్నం కోసం వేధింపులు
- దుడ్డుకర్రతో కొట్టి చంపిన దుండగుడు

## హైదరాబాద్ ఓల్డ్ సిటీలో రూ.400 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- పాతబస్తీలో 7 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- భూమి విలువ రూ.400 కోట్లు ఉంటుందని అంచనా
- దశాబ్దాలుగా కబ్జాలో ఉంచిన వారిని ఖాళీ చేయించిన అధికారులు
- హైడ్రా చర్యలపై స్థానిక ప్రజల హర్షం
- చెరువు, నాలాలను కూడా పునరుద్ధరించాలని విజ్ఞప్తి



2లో



## ఎంపిలకు స్పీకర్ ఓంబిర్లా తేనీటి విందు

సరదాగా ముచ్చిటించుకున్న సభ్యులు

హాజరైన ప్రధాని మోడీ, రాజ్‌నాథ్ సింగ్

ప్రధాని విదేశీ పర్యటనపై ప్రియాంక ఆరా

**న్యూఢిల్లీ ప్రభాత సూర్య:** గత సమావేశాల మాదిరిగా కాకుండా ఈ టీపార్టీకి విపక్ష ఎంపీలు కూడా హాజరయ్యారు. స్నేహపూర్వక వాతావరణంలో సరదా ముచ్చట్లతో సభ్యులంతా సందడిగా గడిపారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ పర్యటనలో ఉండటంతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా స్పీకర్ ఇచ్చిన టీపార్టీలో పాల్గొన్నారు.

2లో



## 41మంది మావోయిస్టుల లొంగుబాటు

డిజిపి శివధర్ ఎదుట లొంగిన నక్సల్స్

- లొంగిన వారిలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి
- కామారెడ్డికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

## నిజామాబాద్ జిల్లాలో దొంగనోట్ల కలకలం

క్రాప్‌లోన్ కట్టేందుకు వెళ్లిన రైతు వద్ద దొంగనోట్లు

- మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో పంచినవిగా అనుమానం
- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభం



# ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట




సమస్యలపై వేగంగా స్పందించి..చర్యలు తీసుకోవాలి

వికసిత భారత్ లక్ష్య సాధనలో సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం

పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** ఉద్యోగ నియామకాల విషయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైంది.

2లో

## బంగ్లాలో హిందూ వ్యతిరేక ఆందోళనలు

దైవదూషణ పేరుతో హిందే యువకుడి దారుణ హత్య

సంతాపంతో సరిపెట్టిన అధ్యక్షుడు యూనస్

ఢాకా,డిసెంబరు19(ఆర్ఎన్ఎ): బంగ్లాలో హిందూ వ్యతిరేక ఆందోళనలు మరోమారు ఉధృతం అయ్యాయి. ఈ క్రమంలో

2లో

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి

పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి

- చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వినతి
- ప్రసాద్ స్కీంలో భద్రాచలానికి 200 కోట్లు విడుదల చేయండి
- కేంద్రాన్ని కోరిక కవిత

**భద్రాద్రి కొత్తగూడెం, ప్రభాత సూర్య :** పరిపాలన సౌలభ్యం కోసం ఐదు గ్రామాలను భద్రాచలంలో కలపాలని ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు.

2లో



## ఎమ్మెల్యేలతో జనసేనాని ముఖాముఖి

9మంది ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా చర్చ

సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులపై పవన్ ఆరా



**అమరావతి, ప్రభాత సూర్య :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తమ పార్టీ ఎమ్మెల్యేలతో వన్ టూ వన్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో భాగంగా తొమ్మిది మంది ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా చర్చలు జరిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌తో వన్ టూ వన్ సమావేశం ప్రారంభమైంది. ప్రతి నియోజకవర్గంలో

# ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట

ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారు. నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరం అని రాష్ట్రపతి అన్నారు. నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. సదస్సుకు హాజరైన రాష్ట్రపతి ముర్ముకు రామోజీ ఫిలిం సిటీలో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట తెలంగాణకు చెందిన పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మయూపీఎస్సీ

చైర్మన్ అజయ్‌కుమార్, యూపీఎస్సీ కార్యదర్శి శశి రంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు శనివారంతో ముగియనుంది. ఈ సదస్సుకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరుకానున్నారు. అంతకుముందు బొల్లారం రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. దేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన ద్రౌపదీ ముర్ము.. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క ఉన్నారు. దేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. సదస్సు అనంతరం సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీలో వివిధ ప్రదేశాలను ద్రౌపదీ ముర్ము సందర్శించారు.

# నిజామాబాద్ జిల్లాలో దొంగనోట్ల కలకలం

నిజామాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): బ్యాంక్ రుణం కట్టేందుకు వచ్చిన వ్యక్తి దగ్గర అన్నీ దొంగనోట్లు ఉండడంతో అధికారులు ఖంగుతిన్నారు. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. బ్యాంకులో పంట రుణం చెల్లించేందుకు తీసుకొచ్చిన నగదు పూర్తిగా దొంగ నోట్లుగా బ్యాంకు అధికారులు గుర్తించారు. రైతు తీసుకొచ్చిన రూ. 2,08,500 లలో అన్నీ రూ.500 నోట్లు నకిలీగా తేల్చారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బ్యాంకు అధికారులు వర్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లాలోని జలాల్పూర్ గ్రామానికి చెందిన రైతు నరెడ్ల చిన్నసాయిలు పంట రుణం చెల్లించేందుకు గురువారం సాయంత్రం వర్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంకుకు రూ. 2,08,500 తీసుకొచ్చాడు. ఈ క్రమంలో నగదును చెల్లించేందుకు క్యాష్ కౌంటర్‌లో ఇచ్చాడు. క్యాష్ కౌంటింగ్ యంత్రంలో నోట్లను లెక్కిస్తుండగా నకిలీ నోట్లు వచ్చాయి. అప్రమత్తమైన బ్యాంకు అధికారులు, సిబ్బంది డబ్బు ఎక్కడి నుంచి తెచ్చావని రైతును ప్రశ్నించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. రైతు తీసుకొచ్చిన రూ. 500 నోట్లను బ్యాంకు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించగా.. అవన్నీ నకిలీ నోట్లేనని గుర్తించారు. నాలుగు రూ.500 నోట్ల కట్టలపై ఒక్కొక్క కట్టపై ఒకేరకమైన క్రమసంఖ్య ఉండటాన్ని గుర్తించారు. దీంతో నకిలీనోట్లని నిర్ధరించి గురువారం రాత్రి వర్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అధికారి పంకజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నకిలీ నోట్ల వ్యవహారం వర్ని మండలంలో కలకలం సృష్టించింది. పరారీలో ఉన్న రైతు కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే ఇదంతా మొన్నటి పంచాయితీ ఎన్నికల్లో పంచిన డబ్బుగా చర్చిస్తున్ఆరు. ఈజీగా డబ్బు సంపాదించేందుకు కొందరు కేటుగాళ్లు నకిలీ నోట్ల ప్రింటింగ్ కు పాల్పడుతున్నారు.

# ఎమ్మెల్యేలతో జనసేనాని ముఖాముఖి

ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, కొనసాగుతున్న ప్రాజెక్టుల వివరాలపై పవన్ కల్యాణ్ సమీక్షించారు. అలాగే నియోజకవర్గాల్లో ఎదురవుతున్న సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కార మార్గాలపై ఎమ్మెల్యేలతో సుదీర్ఘంగా చర్చించారు. అదేవిధంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, కార్యకర్తలతో సమన్వయం వంటి అంశాలపై కూడా డిప్యూటీ సీఎం ఎమ్మెల్యేల నుంచి వివరాలు సేకరించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా చేరేలా ఎమ్మెల్యేలు కృషి చేయాలని సూచించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అనంతరం దేవ వరప్రసాద్, లోకం నాగ మాధవి, గిడ్డి సత్యనారాయణ, పంతం నానాజీ, సీహెచ్ వంశీ కృష్ణ, నిమ్మక జయకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్‌లతో పవన్ కల్యాణ్ వన్ టూ వన్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల ద్వారా ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి, పాలనలో వేగం పెంచడం, ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ఎంపిలకు స్పీకర్ ఓంబిర్లా తేనీటి విందు

విపక్షం తరఫున ప్రాతినిధ్యం వహించారు. 20 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఓం బిర్లా, మోదీతో పాటు రాజ్‌నాథ్ సింగ్ కూర్చుని ఉండగా ఆయన పక్కన ప్రియాంక ఆసీనులయ్యారు. తన నియోజకవర్గం వయనాడ్ నుంచి తెచ్చుకున్న ఒక మూలికను ఎలర్జీ రాకుండా తీసుకుంటూ ఉంటానని ప్రియాంక వివరించారట. మోదీ ఇటీవల జరిపిన ఇథియోపియా, జోర్డాన్, ఒమన్ పర్యటన గురించి ప్రియాంక అడగగా, బాగా జరిగిందని ఆయన బదులిచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సులే, సీపీఐ నేత డి.రాజా కూడా సమావేశం లో పాల్గొన్నారు. శీతాకాల సమావేశాలను మరికొద్ది రోజులు పొడిగించి ఉండాల్సిందని ధర్మేంద్ర యాదవ్ అభిప్రాయపడగా, ఆయనకు గొంతు నొప్పి రాకుండా ఇక్కడితో ముగించామని మోదీ సరదాగా బదులిచ్చారు. బాగా ప్రిపేర్ అయి సభకు వచ్చారంటూ ఎన్‌కే రామచంద్రన్ తదితర విపక్ష ఎంపీలను పీఎం అభినందించారు. పాత పార్లమెంటు భవనంలో మాదిరిగానే న్యూ పార్లమెంట్ బిల్డింగ్‌లో ఎంపీల కోసం ఒక సెంట్రల్ హాల్ చేర్చాలని పలువురు ఎంపీలు మోదీని కోరారు. సెంట్రల్ హాలులో ఎంపీలు, రిటైర్‌మెంట్ అయిన ఎంపీలు చర్చించుకునే వారు. దీనిపై మోదీ సరదాగా స్పందించారు. అది రిటైర్‌మెంట్ తర్వాత కదా...ఇంకా మీరు చాలా సేవ చేయాల్సి ఉంది.. అని అనడంతో సమావేశంలో నవ్వులు వెల్లివిరిసాయి.

# బంగ్లాలో హిందూ వ్యతిరేక ఆందోళనలు



ఓ హిందూ వ్యక్తిని దుండగులు దారుణంగా చంపారు. ముఖ్యంగా, రాడికల్ శక్తులు హిందువులను టా÷–గ్గ్÷ట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉంటే, మైమన్‌సింగ్ జిల్లాలో ఒక హిందూ వ్యక్తిని 'దైవ దూషణ' చేశాడనే ఆరోపణలో కొట్టి చంపడం సంచలనంగా మారింది. బాధితుడిని 30 ఏళ్ల దీపు చంద్ర దాస్‌గా గుర్తించారు. గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అతడిపై దాడి జరిగింది. అయితే, ఈ హింసపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనస్ స్పందించారు. మైమెన్సింగ్‌లో ఒక హిందూ వ్యక్తిని కొట్టి చంపిన సంఘటనను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. న్యూ బంగ్లాదేశ్‌లో ఈ రకమైన హింసకు చోటు లేదు. ఈ క్రూరమైన నేరంలో పాల్గొన్న ఎవరినీ వదలబోము అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని తీవ్రవాద గ్రూపులు నిర్వహిస్తున్న హింస పట్ల అప్రమత్తంగా ఉండాలని తాత్కాలిక ప్రభుత్వం ప్రజలను కోరింది. హింస, భయం, దహనం, విధ్వంసం వంటి చర్యలను ఖండిస్తున్నట్లు పేర్కొంది. బంగ్లాదేశ్ కీలకమైన సమయంలో చారిత్రాత్మక ప్రజాస్వామ్య పరివర్తన గుండా వెళ్తోందని, గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నాలను సృష్టించి దేశం అశాంతి వైపు ప్రయణించడాన్ని అనుమతించబోమని హెచ్చరించారు. షేక్ హసీనా అవామీ లీగ్ ప్రభుత్వాన్ని కూల్చివేయడంలో కీలక పాత్ర పోషించిన, భారత వ్యతిరేకిగా పేరుగాంచిన విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదిని కొన్ని రోజుల క్రితం ఢాకాలో గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి వెళ్లారు. ఆయన తీవ్ర గాయాలపాలై చికిత్స తీసుకుంటూ మరణించాడు.

# 41మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** నిషేధిత మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో బటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉన్నారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉండటం గమనార్హం. పోలీసుల వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్/కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళు ,, .303 రైఫిళ్లు తదితర ఆయుధాలు లొంగుబాటులో భాగంగా అప్పగించారు. మావోయిస్టు పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో తీవ్ర జీవన కష్టాలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగానే తాము ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతా యని, మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు. నక్సలిజాన్ని రూపుమాపేందుకు, మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ ను తీసుకొ చ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎంతోమంది మావోలు భద్రతబలగాల ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. మరికొందరు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ క్రమంలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 40 మంది మావోయిస్టులు లొంగిపోయారు. డీజీపీ సమక్షంలో జనజీవన స్రవంతిలో మావోయిస్టులు కలిసిపోయారు..

# హైదరాబాద్ ఓల్డ్ సిటీలో రూ.400 కోట్ల విలువైన

## భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్ పాతబస్తీలో దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమికి విముక్తి లభించింది. సుమారు రూ.400 కోట్ల విలువైన 7 ఎకరాల స్థలాన్ని హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ అథారిటీ (హైడ్రా) శుక్రవారం స్వాధీనం చేసుకుంది. కోర్టు కేసులు, పోలీసు ఫిర్యాదులను సైతం లెక్కచేయకుండా ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన ఇనుప రేకుల ప్రహరీని తొలగించి, ఆ స్థలం ప్రభుత్వానిదని బోర్డులు ఏర్పాటు చేశారు. బండ్లగూడ మండలం, కందికల్ గ్రామంలోని మహమ్మద్‌నగర్–లలితాబాగ్ ప్రాంతంలో సర్వే నంబర్ 28లో మొత్తం 9.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే 2 ఎకరాలు కబ్జాకు గురై నివాసాలు వెలిశాయి. మిగిలిన 7 ఎకరాలను ఆర్. వెంకటేష్ కుటుంబ సభ్యులు, వారి నుంచి కొనుగోలు చేశానని చెబుతున్న పట్టాభి రామిరెడ్డి తమ ఆధీనంలో ఉంచుకున్నారు. సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల ప్రకారం ఇక్కడ ఒక చెరువు ఉండేదని, దానిని కబ్జాదారులు మట్టితో పూడ్చివేశారని అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులు భవానీ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భూమిని తమదని వాదిస్తూ కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు ఆక్రమణదారులకు న్యాయస్థానం కోటి రూపాయల జరిమానా కూడా విధించింది. అయినప్పటికీ వారు భూమిని ఖాళీ చేయలేదు. తాజాగా హైడ్రా అధికారులు పోలీసు బందోబస్తు మధ్య కబ్జాదారుల చెర నుంచి భూమిని విడిపించారు. ఈ చర్యపై స్థానికులు, కుమ్మరివాడి పీస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

# ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి

అలాగే అశ్వరావుపేట పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి చేశారు. ప్రసాద్ స్కీంలో భద్రాచలం రామాలయానికి రెండు వందల కోట్లు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసులు, గిరిజనుల సంక్షేమం కోసం చేసిన ఖర్చులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క శ్వేతపత్రం విడుదల చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతిబాటలో భాగంగా ఆమె జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ పాలనలో ఆదివాసులు, గిరిజనులకు ఏం చేశారో వెల్లడించాలన్నారు. సింగరేణి పుట్టినిల్లు ఇల్లందులో కొత్త బొగ్గు బావులు మొదలు పెట్టాలని అన్నారు. సింగరేణి కార్మికులు సంక్షేమం కోసం కాకుండా సీఎం రేవంత్ పుట్ బాల్ కోసం పది కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో కొత్తగూడెంకు ప్రాధాన్యం లేదని విమర్శించారు. ఒక మంత్రి కొత్తగూడెంను దత్తత తీసుకోవాలని.. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలన్నారు. మణుగూరు ఓసీ 2 ప్రైవేటీకరణ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి జిల్లాలో పొలాలకు అందించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విలీనమైన ఎటపాక పురుషోత్తమ పట్నం, గుండాల, పిచుకులపాడు, కన్నాయిగూడెం గ్రామాలను భద్రాచలంలో కలపాలన్నారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు.

# వికారాబాద్ జిల్లాలో దారుణం



**వికారాబాద్, ప్రభాత సూర్య:** వికారాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ప్రేమించి పెళ్లాడిన వాడే ఆమె పాలిట కాలయముడయ్యాడు. పెళ్లయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం చిత్రవధలకు గురిచేశాడు. చివరకు విచక్షణారహితంగా కొట్టి చంపేశాడు. ఈ దారుణ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. తాజాగా ఈ కిరాతకానికి సంబంధించిన వీడియో బయటకొచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన పరమేశ్, అనూష (22) ప్రేమించుకున్నారు. పరమేశ్ పట్టుబట్టడంతో అతని తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా సరే, 8 నెలల క్రితం పెళ్లి జరిపించారు. ప్రేమించి పెళ్లాడిన వ్యక్తితో సంతోషంగా గడపొచ్చని భర్తతో మెట్టింటికి అడుగుపెట్టిన అనూషకు నిరాశే ఎదురైంది. అత్తమామలతో పాటు భర్త నుంచి వరకట్న వేధింపులు మొదలయ్యాయి. కొద్దిరోజులుగా కట్నం కోసం వారు వేధింపులకు గురిచేశారు. వారం రోజుల క్రితం విచక్షణారహితంగా కొట్టారు. ఈ విషయం తెలిసిన అనూష తల్లి, సోదరుడి వరసయ్యే వ్యక్తి వచ్చి ఆమెను పుట్టింటికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయితే అనూషను మంచిగా చూసుకుంటానని చెప్పిన పరమేశ్.. గురువారం నాడు ఆమెను తీసుకుని ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత మరోసారి అనూషతో గొడవపడ్డాడు. ఆమెను తీవ్రంగా కొట్టాడు. దీంతో అనూష అపస్మారక స్థితిలోకి చేరుకుంది. ఇది గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అనూష మృతిచెందింది.

# పంచాయితీలకు సెలవ్.. పెట్టండి

ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమావేశమైన కేటీఆర్.. వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి కాబట్టి.. పగలు, పంచాయితీలో పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండాను గుండెలను హత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని చోట్ల రెండు వైపులా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే నిలబడ్డారని తెలిపారు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి, మండల పరిషత్‌కు అనుసంధానకర్త ఎంపీటీసీ అని కేటీఆర్ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు సమన్వయకర్త జడ్పీటీసీ అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలతో పంచాయితీలు పక్కనపెట్టాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పల్లెపల్లెనా డంపింగ్ యార్డులు, ప్రగతి వనాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి కాంగ్రెస్‌పై కొట్లాడాలన్నారు. గులాబీ గెలుపును చూసి కాంగ్రెస్ పరేషన్ అయితోందని తెలిపారు. ఓడిపోయిన అభ్యర్థులు కూడా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయాలన్నారు. పాత తరం నాయకులు, కొత్త తరాన్ని కలుపుకుంటూ ముందుకుపోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని కేటీఆర్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మొదట 66 శాతం సర్పంచ్ స్థానాలు గెలిచామని చెప్పారని తెలిపారు. వెంటనే మాటమార్చి స్థానిక ఎన్నికలతో పార్టీకి సంబంధం లేదంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని అన్నారు.

# పని హక్కు పాలకుల దయ మీద ఆధారపడి ఉండాలన..?

**మోడీ ప్రభుత్వానికి కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు పట్టవా...?**

**ఇప్పటికైనా జీ రామ్ జీ పథకాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను కొనసాగించాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ డిమాండ్**



**భువనగిరి, డిసెంబర్ 19(ప్రభాత సూర్య):** మోడీ విధానాల వల్ల రోజుకు భారతీయ ప్రజాస్వామ్యానికి పాడు కాలం దాపురించిందని, ముఖ్యంగా గ్రామీణ పేదలకు చెడు రోజులు వచ్చాయని హక్కుగా ఉన్న చట్టాన్ని పని కోసం పాలకుల దయ మీద ఆధారపడి విధంగా జీ రామ్ జీ – 2025 పథకం తీసుకురావడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని ఇప్పటికైనా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. శుక్రవారం మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ దాని స్థానంలో తీసుకువచ్చిన వీబీ జీ రామ్ జీ బిల్లును వ్యతిరేకిస్తూ భువనగిరి జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ముందు సిపిఎం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బిల్లు ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని మారుస్తూ ఏకపక్షంగా పార్లమెంటులో తనకు నచ్చిన బిల్లును ఆమోదింప చేసుకోవడం చాలా దారుణమని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి గాంధీ పేరును మార్చి రాముడి పేరు పెట్టి పేదల పొట్ట కొట్టేందుకు మోడీ ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. ఈ బిల్లు వల్ల వ్యవసాయ కూలీలు పేదలు నష్టపోయే పరిస్థితి ఉన్నదని దీనికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు తిరుగుబాటు చేయాలని జాంగిర్ పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎందుకు రద్దు చేశారు మోడీ ప్రభుత్వం దగ్గర స్పష్టత లేదని విమర్శించారు. ఈ కొత్త బిల్లు ఉన్న ఉపాధిని లేకుండా చేస్తున్నదని అన్నారు. వ్యవసాయ సీజన్ లో రైతులకు కూలీల కొరత లేకుండా అని రైతుల ముసుగు తగిలించారని విమర్శించారు. వరకు 90% ఉపాధి హామీ పనుల నిధులు కేంద్ర ప్రభుత్వం, 10% వాటా రాష్ట్ర ప్రభుత్వం ఉండేదని ఇప్పుడు కొత్త పథకంలో 40 % వాటా రాష్ట్రాలు ఇవ్వాలని చెప్పటం కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ఎత్తివేయాలనె కుట్రలో భాగమేనని అన్నారు. పనులను 4 రకాలుగా విభజించి కోట్ల రూపాయల పనులను చేర్చారని ఈ పనులు మొత్తము కాంట్రాక్టర్లకు ఉపాధి హామీగా మార్చటమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల కంటే రాష్ట్రలాల్లో ఎక్కువ వేతనాలు ఉంటే అవే కనీస వేతనాలుగా ఉండాలని ఇప్పుడు ఉన్న దానిని కొత్త బిల్లులో రద్దు చేశారని విమర్శించారు. ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలు పెరగాలని ఉన్న నిబంధన ఇప్పుడు తొలిగించారని అన్నారు. ఆధార్ నిబంధన కచ్చితంగా అమలు చేయడం లేదని సుప్రీం కోర్టుకు స్పష్టం చేసి ఇప్పటికే ఉపాధికి ఆధార్ లింక్ , కొలతలతో వేతనాలు ఇస్తూ రెండు పూటల హాజరు , కేవైసీ చట్ట విరుద్ధంగా పెట్టారని ఆందోళనకు చేస్తుంటే ఇప్పుడు బయమెట్రిక్, ఏఐ, జీపీఎస్ ను చట్ట బద్ధం చెయ్యటం కంటే పేదలను ఉపాధి హామీ నుండి తొలగించడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. ఇప్పటి వరకూ పంచాయతీలు ప్రధాన పాత్ర ఉన్నదని ఇప్పుడు అన్ని అధికారాలు కేంద్రంకు ఉంటాయని చివరకు సోషల్ ఆడిట్ కూడా మనుషులు కాకుండా టెక్నాలజీ తో చేస్తామని ప్రభుత్వం చెబుతుందని దీని వలన ఉపయోగం ఎవరికి ఉంటుందని ప్రశ్నించారు. ఉపాధి హామీ నిధులతో ఎస్సీ ,ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం ఇస్తున్న భూముల అభివృద్ధి, కాలనీల అభివృద్ధి, డబల్ బెడ్ రూమ్ ఇళ్లు, నివాస ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ఉపాధి నిధులు మంజూరు చేస్తూ పనులు చేపట్టడం జరిగిందని ఇప్పుడు వాటి ప్రస్తావనే లేకుండా పోయిందని ఇలాంటి అనేక అంశాలు ఉపాధి హామీ చట్టానికి వ్యతిరేకంగా అనేకం ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మౌలిక స్ఫూర్తికి పూర్తిగా నిర్వీర్యం , రద్దు ఇప్పుడున్న ఉపాధి చట్టంలో ఉందని అన్నారు. ఆనాడు గ్రామాల్లో పడిపోతున్న ఉపాధి పని దినాల వలన పేదలు బ్రతక లేరని ప్రభుత్వ భాధ్యతగా భావించి 100 రోజు ఉపాధి చట్టంగా వచ్చిందని. ఇప్పుడు మిషన్ గా మార్చటం వల్ల ఉపాధి అవకాశాలు మరింత కుదించటం కోసం ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకొచ్చింది అని అన్నారు. ఈ కొత్త బిల్లు ఉపాధిని హరించేదిగా కొద్ది మేరకు ఉన్న ఉపాధి అవకాశాలు కూడా లేకుండా పోతవని అందుకే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టటమే ఉండాలని నర్సింహ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దయ్యాల నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చీమలకొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య , ప్రజా సంఘాల నాయకులు ఈర్లపల్లి ముత్యాలు, లావుడియా రాజు, ఎండి సలీం, కొండమడుగు నాగమణి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తిప్పికొడదాం

**చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలి... చట్ట పరిరక్షణకు ఊరూరా ఉద్యమం**

**సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**సంగారెడ్డిలో "ఉపాధి చట్ట సవరణ" ప్రతులు దహనం**



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 19:** ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతుందని, ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు సిపిఎం పోరాడుతుందని, ఉపాది హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని లేనిపక్షంలో ఊరూరా ఉద్యమాన్ని చేపడుతామని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు.ఈరోజు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో నూతనంగా తెచ్చిన "విబి-జి రాం జి పేరుతో ఉపాధి హామీ పథకం పత్రాలను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం సవరణలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించే వరకు పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలను రద్దు చేయాలన్నారు. చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. యుపిఎ ప్రభుత్వంపై వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపుదిద్దుకున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం మౌలిక స్వభావాన్ని కేంద్ర ప్రభుత్వం మారుస్తోందన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రాం జి) పేరుతో ఉపాధి హామీ పథకానికి "రాంరాం" పలకనుందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా పని హక్కుగా ఉన్న పాతచట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని తెలిపారు. సాధారణ పథకంగా దీనిని మారిస్తే, ఈ పథకం కొనసాగవచ్చు లేదా రద్దు చేయవచ్చు అన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ కార్మికుల డిమాండ్ ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చేసి అవసరాన్ని (సప్లయిని బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. కొత్త పథకంలో పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనన్నారు. యంజిఎస్ఆర్ ఈజిఏగా ఉన్న ఈ పథకం పేరును మార్చడం మహాత్ముడిని అవమానించడమేనన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని చెప్పారు. అంతేకాకుండా మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారని వివరించారు. ఈ పథకం అమలుకు ఇప్పటివరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్లరూపాయల భారాలు మోపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిలు, నర్సింలు, నాయకులు యాదగిరి, కృష్ణ, అశోక్, సతీష్, రమేష్ గౌడ్, శివ, ఆశన్న గౌడ్, అంజగౌడ్ తది తరులు పాల్గొన్నారు

## సంగారెడ్డి, నారాయణఖేడ్లలో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళా

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 19:** సంగారెడ్డి జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ల)కొరకు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ , రిజిస్ట్రేషన్ మేళా డిసెంబర్ 20, 2025 నిర్వహించనున్నట్లు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అధికారి అమృత శ్రీ శుక్రవారం నాడొక ప్రకటన లో తెలిపారు.ఈ మేళా జిల్లాలో సంగారెడ్డి, నారాయణఖేడ్ లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డిలో కలెక్టరేట్ కాంప్లెక్స్ లోని గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో, నారాయణఖేడ్ లో శ్రీ వెంకటేశ్వర సినిమా థియేటర్ నందు,ఉదయం 10.00 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆహార వ్యాపార నిర్వాహకులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు పొందడం లేదా రెన్యువల్ చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 9908978790, 9985600602 మొబైల్ నంబర్లలో సంప్రదించ వచ్చని తెలిపారు.

## తెలుగుదేశం పార్టీ ఓటు బ్యాంకు తోనే సర్పంచులు ఎంపిక సాధ్యమైంది

**తె.దే.పా. పార్టీ ఉపాధ్యక్షులు గోసుకొండ వెంకటేష్.**



**గట్టుపల్ ప్రభాత సూర్య డిసెంబర్19:**నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ సర్పంచుల ఎంపిక తెలుగుదేశం పార్టీ ఓటు బ్యాంకు తోనే సాధ్యమైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోస్కొండ వెంకటేష్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రాతినిధ్యం వహించినప్పటికీ స్పష్టమైన ఓటు బ్యాంకు కలిగిన తె.దే.పా. పార్టీ గ్రామాల వారిగా అభివృద్ధికి పాటుపడే అభ్యర్థులకు మద్దతు ఇవ్వడంతో 105,సర్పంచులు అఖండ విజయం సాధ్యమైందని గోసుకొండ వెంకటేష్ అన్నారు. జరగబోయే ఎంపీటీసీ జడ్పిటిసి మున్సిపాలిటీ ఎన్నికల్లో తమ పార్టీ ప్రజా సంక్షేమానికి పాటుపడి పనిచేసే అభ్యర్థులకు మద్దతుగా నిలిచి గెలిపించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా మునుగోడు నియోజకవర్గంలో ఏడు మండలాల్లో అనుకూల గ్రామాల్లో టిడిపి అభ్యర్థులు రంగంలో ఉంటారని ఆయన తెలిపారు. 95.నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరియు ఆల్ పార్టీస్ తెలుగుదేశం పార్టీ మద్దతు తీసుకొని గెలిచిన వారే తెలుగుదేశం పార్టీ లేదు అన్నవారే ఈరోజు అదే తెలుగుదేశం పార్టీ మద్దతు తీసుకొని గెలిచారు. ఇప్పటికైనా స్పష్టంగా అర్థమైందా, ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఉన్నారు. పట్టించుకునే నాయకుడు లేకపోయినా ప్రతిష్టంగా కార్యకర్తలు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచారు. మునుగోడు నియోజకవర్గంలో ఒక సర్పంచ్, ఉప సర్పంచ్, పది వార్డు మెంబర్లు గెలుపొందడం జరిగింది. రానున్న జడ్పిటిసి, ఎంపీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బారిలో నిలబడి అత్యధిక సీట్లను కైవసం చేసుకోవడం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మునుగోడు నియోజకవర్గంలో చలమల దారేటు....

**గ్రామపంచాయతీ ఎన్నికలలో ప్రత్యర్థి అభ్యర్థుల గెలుపుకు పరోక్షంగా సహకారం...**

**బిజెపి సర్పంచ్ విజయోత్సవ ర్యాలీలో చలమలకు సన్మానం...**

**నియోజకవర్గం లో సొంత వర్గాన్ని ఏర్పాటు చేసుకొని పార్టీ ప్రతిష్ట దెబ్బతీస్తున్న చలమలపై చర్యలు ఉండావా...?**





**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 19( ప్రభాత సూర్య):** సంస్థాన్ నారాయణపురం మండల అల్లందేవిచెరువు గ్రామంలో, అధికార పార్టీ కాకుండా బీజేపీ పార్టీ అభ్యర్థి గెలిపించడంలో, చలమల కృష్ణారెడ్డి హస్తం ఉందా? అవును ఉంది అనే ఆరోపణ వినిపిస్తున్నాయి. రేపే ఎన్నికలు అనే రోజు వరకు ఊపందుకున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రచారంలో తిరిగిన కొంతమంది రెడ్డి నాయకులు ఎన్నికల రోజు కనపడకుండా ఉండటం పలు విమర్శలకు తావిస్తుంది. అదే రోజు చలమల కృష్ణారెడ్డి బిజెపి నాయకులతో కలిసి శాలువాతో సత్కారం చేయించుకోవడం,వారితో కలిసి ఉన్న ఫోటో పై పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. చలమల తీరుపై కాంగ్రెస్ నాయకులు పలు ఆరోపణలు చేస్తున్నారు .బీజేపీ పార్టీ సర్పంచ్ గెలిచిన చోట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల కృష్ణారెడ్డి సన్మానం చేసుకోవడం ఏంటి అని ప్రశ్నిస్తున్నారు ?బీజేపీకి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల కృష్ణారెడ్డి కి ఏం సంబంధం ఏమిటని ప్రశ్నార్థకంగా మిగిలింది. చలమల బిజెపి వైపు మొగ్గు చూపుతున్నాడనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బిజెపి నాయకులతో కలిసి ఉండటం నిజమే అయి ఉండవచ్చునని, గెలిచిన బీజేపీ పార్టీ సర్పంచ్ ర్యాలీలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల కృష్ణారెడ్డి శాలువాతో సత్కారం చేయించుకోవడంపై రెడ్డి రాజకీయం నడుస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా నాగవారిగూడెం , గొల్లగూడెం గ్రామాలకు చలమల్ల సరైన సహకారం అందించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.అదేవిధంగా మల్లారెడ్డిగూడెం లో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సొంతం గ్రామం లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోకపోవడం స్వతంత్ర అభ్యర్థి గెలిపించడంలో చలమల పాత్ర ఉందని కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు. నారాయణపురం మండలంలో ఒక వర్గం ఏర్పాటు చేసుకొని, కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన కార్యకర్తలు తన వర్గం కాకుండా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న ఏ అభ్యర్థి నైనా ఓడించడానికి సాయ శక్తులు ప్రయత్నం చేయడం జరిగిందని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. అల్లందేవిచెరువు,లింగ వారి గూడెం, మల్లారెడ్డిగూడెం, చిమిర్యాల, మహమ్మదాబాద్ , కంకణాలగూడెం, ఇలా చెప్పుకుంటూ వెళితే సుమారు 10 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ గెలువనీయకుండా చేసినటువంటి చలమల కృష్ణారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏ విధమైన చర్యలు తీసుకుంటది అనేది వేచి ఉండాలని అంటున్నారు. వివిధ రాజకీయ నాయకులు. సొంత పార్టీ సర్పంచ్ అభ్యర్థులను ఓడించడానికి ముఖ్య పాత్ర వహిస్తున్న చలమల కృష్ణారెడ్డి అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుందని అనుకుంటున్నారు.

# విపత్తు సమయంలో అవసరమైన సేవలు

**విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై 22న ప్రయోగాత్మకంగా మాక్ ఎక్సర్ సైజ్.. పి .ప్రావీణ్య ,జిల్లా కలెక్టర్**






**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 19:** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్ధవంతంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ఈ నెల 22వ తేదీన జిల్లాలో ప్రయోగాత్మక రీతిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న టేబుల్ టాప్ (మాక్) ఎక్సర్ సైజ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.పారిశ్రామిక, ప్రమాదాలు,వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం నివారించేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై సన్నద్ధతను పెంపొందించేందుకు వీలుగా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22న అన్ని జిల్లాలలో మాక్ ఎక్సర్ సైజ్ ను నిర్వహించాలని ఆదేశించింది.ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్ లోని టీ.జీ.ఐ.సి.సి.సి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఎన్.డీ.ఎం.ఎ మేజర్ సుధీర్, ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ హసనైన్,తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ ఇతరఉన్నథాధికారూలతొ కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాక్ ఎక్సర్ సైజ్ చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి తెలియజేస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీ.ఎస్, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలలో అనుకోని ప్రమాదాలు సంభవిస్తే అవసరమైన సహాయక చర్యలు చేపట్టడానికి పరిశ్రమల శాఖ, అగ్నిమాపక శాఖ వైద్య ఆరోగ్య శాఖ రెవెన్యూ పోలీస్ యంత్రాంగంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని భారీ మధ్యతర సూక్ష్మ పరిశ్రమలలో ఆయా పరిశ్రమల స్థాయిలకు అనుగుణంగా భద్రతా ప్రమాణాలు పాటించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణ కోసం తరచూ అధికారుల బృందాలు పరిశ్రమలను తనిఖీ చేస్తూ అవసరమైన భద్రతా ప్రమాణాలు పరిశ్రమంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు, ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు పారిశ్రామిక ప్రాంతాలలో చేపట్టినట్లు తెలిపారు.ఎస్. డీ.ఆర్.ఎఫ్ బృందాలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం, అంబులెన్సులు, అందుబాటులో ఉంచడం, రెస్క్యూ టీంలు, మెడికల్ టీంలను ఏర్పాటు చేయడం, ఇతర సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్లు తెలిపారు . విపత్తులు సంభవించిన సమయంలో సమర్ధవంతంగా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ విపత్తుల నిర్వహణపై చేపట్టనున్న మాక్ ఎక్సర్ సైజ్ కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు . ఈ నెల 22వ తేదీ నాటి మాక్ ఎక్సర్ సైజ్ సందర్భంగా ఈ తరహా అన్ని చర్యలు ప్రయోగాత్మకంగా చేపట్టేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పలు పరిశ్రమలలో ప్రమాదాలు చోటుచేసుకుని మరణాలు సంబంచించడం ,వంటి విపత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విపత్తుల నిర్వహణ విషయంలో అప్రమత్తతను పెంపొందించేందుకు 22న మాక్ ఎక్సర్ సైజ్ నిర్వహించాలని ఆదేశించిందని అన్నారు. ఇది ప్రయోగాత్మక కార్యక్రమం అయినప్పటికీ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ,అధికారులను ఆదేశించారు. మాక్ ఎక్సర్ సైజ్ ను నిర్వహించడం వల్ల విపత్తులను ఎదుర్కొనే విషయంలో ఏ మేరకు సన్నద్ధత కలిగి ఉన్నామనే విషయం వెల్లడి అవుతుందని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరి చేసుకునేందుకు, అవసరమైన పరికరాలను సమకూర్చుకునేందుకు అవకాశం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖల అధికారులు అందరూ మాక్ ఎక్సర్ సైజ్ ను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. విపత్తుల సమయంలో నీటిపారుదల, అగ్నిమాపక, విద్యుత్, రహదారుల, పోలీస్, రెవెన్యూ, వైద్య, పౌరసరఫరాల తదితర శాఖల అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ మాధురి , జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ , ఎస్పీ రఘునందన్ రావు , జి ఎం , డి ఐ సి తుల్జా నాయక్ , జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు , డి టి ఓ అరుణ ,కలెక్టరేట్ విపత్తుల నిర్వహణ విభాగం పర్యవేక్షకుడు లింగ శేఖర్ , ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, వైద్యారోగం, పోలీస్, మున్సిపల్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## శ్రీశ్రీశ్రీ శంకరనంద స్వామి నిత్య అన్నదాన ట్రస్ట్ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో పూజా కార్యక్రమం నిర్వహించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం,డిసెంబర్ 19(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ శంకరనంద స్వామి నిత్య అన్నదాన సేవా ట్రస్ట్ అన్నపూర్ణేశ్వరి అమ్మవారి దర్శనం చేసుకొని అనంతరం శంకరానంద స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీశ్రీశ్రీ శంకరానంద స్వామి సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామిని శాలువాతో సత్కరించారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మీ ఆశీస్సులతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతారని అన్నారు. కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు 13వ వార్డు సభ్యులు మందుగుల బాలకృష్ణ, మారగోని శంకర్ గౌడ్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, బానోతు కిరణ్ నాయక్, గణేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి చర్యలుతీసుకోవాలని బిజెపి నేతల వినతి..



**మియాపూర్ ప్రభాత సూర్య :** మియాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య వల్ల చాలా కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మియాపూర్ డివిజన్ కు చెందిన బిజెపి నేతలు మియాపూర్ ట్రాఫిక్ సి ఐ ప్రశాంత్ కు వినతి పత్రం అందజేశారు.బొల్లారం, బాచుపల్లి వైపు నుండి మియాపూర్ వైపు నుండి వచ్చి కూకట్ పల్లి వైపు వెళ్ళే వాహనాలను కచ్చితంగా ఎడమ వైపు నుండి వెళ్లే విధంగా మళ్లించాలని, దీనివల్ల ప్రజలు ట్రాఫిక్ సమస్య నుండి కొంత ఉపశమనం కలుగుతుందని దీనికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.రోడ్డు మీదకు వచ్చిన సైన్ బోర్డులను, వ్యాపార సముదాయాల ముందున్న ఫూట్ పాత్ ఆక్రమణలు కూడా తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి మాణిక్ రావు, సీనియర్ నాయకులు, గుండె గణేష్ ముదిరాజ్, రవి గౌడ్, ప్రభాకర్ , అభిరామ్ పాల్గొన్నారు.

## ఉప్పల విజయలక్ష్మి-లింగస్వామి సర్పంచ్ గా అఖండ విజయం

**గ్రామ అభివృద్ధికి నవశకం**

**సర్పంచ్ గా రాష్ట్ర చరిత్రలోనే సంస్థాన్ దే అత్యధిక మెజారిటీ**

**యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు బద్దుల మురళీ యాదవ్ ఉప్పల శ్రీనివాస్**

**సంస్థాన్ నారాయణపూర్,డిసెంబర్ 19(ప్రభాత సూర్య):** సంస్థాన్ నారాయణపూర్ సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో 3027 ఓట్ల తేడాతో తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో అఖండ విజయం సాధించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి-లింగస్వామి గెలుపుతో గ్రామంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు బద్దుల మురళీ యాదవ్, ఉప్పల శ్రీనివాస్ లు అన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఆరున్నర సంవస్థరాలుగా ఉప్పల లింగస్వామి పేద ప్రజలపై మమకారంతో చనిపోయిన ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి వారిలో మనోస్థ్యరాన్ని నింపి బాసటగా నిలిచాడని, అలాగే యువత కోసం క్రీడ పోటీలు , ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయించి అండగా ఉంటూ ప్రజా ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో విజయం సాధించాడానీ వారు పేర్కొన్నారు.





## అనాసాగరం సర్పంచ్, నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించిన ఇమాం భాయ్

**ఖమ్మం( సూర్య ప్రతినిధి ) :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామ సర్పంచ్ బొడ్డు రాంబాబు ఉప సర్పంచ్ షేక్ మధార్ సాహెబ్ వార్డు సభ్యులను టెలికాం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ మైనార్టీ కాంగ్రెస్ నాయకులు షేక్ ఇమామ్ బాయ్ స్వగ్రామం కావడంతో వారి ఇంటి వద్ద కొత్త నూతన పాలకవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించారు. సీట్లు తినిపించారు.అనాసాగరం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు రాంబాబు ఉప సర్పంచ్ షేక్ మదార్ సాహెబ్ వార్డు సభ్యులు మౌనిక నాగమణి నోముల సైదమ్మ ఎడ్ల తిరుపతిరావు బొడ్డు మధు బొడ్డు నాగమణి రాయపాటి సిద్దు అనాసాగరం గ్రామ కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి వెంకటనారాయణ నోముల వెంకటనారాయణ మేళ్లచెరువు నాగేశ్వరరావు షేక్ జాఫర్ షేక్ గోరి సాహెబ్ రేగళ్ల రామకృష్ణ దుబ్బాకుల రమేష్ కోడి రామకృష్ణ గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్ గా ఎన్నికైన ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి సన్మానించిన ముస్లిం మైనార్టీ నాయకులు

**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 19( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో పెద్ద మసీద్ లో గ్రామ సర్పంచ్ గా భారీ మెజార్టీతో విజయం సాధించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఘనంగా సన్మానించిన ముస్లిం మైనార్టీ సోదరులు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొన్ రేడ్డి నరసింహ,వివిధ పార్టీలను మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బీసీ ఐక్య వేదిక ముఖ్య సలహాదారులు గా పట్లూరి కృష్ణమోహన్..

**నియామక పత్రం అందించిన భేరి రామచందర్ యాదవ్..**



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :**తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బీసీ ఐక్యవేదిక నాయకులు, ముఖ్య సలహాదారుగా నియమితులైన పట్లూరి కృష్ణమోహన్ కి బేరి చేతుల మీదుగా నియామక పత్రం అందజేయడం జరిగింది. నియమితులైన కృష్ణమోహన్ బిసి అధ్యక్షుల ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కులాల సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సంఘాల వారికి న్యాయం చేకూరుస్తానని వారికి ఏ సమస్యలు వచ్చినా రాష్ట్ర కమిటీ తరఫున సంప్రదించి వారికి మా సహాయ సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ చారి, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## అజయ్ తండా గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతా: సర్పంచ్ తేజావత్ శివాజీ

**ఖమ్మం ( సూర్య ప్రతినిధి):** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అజయ్ తండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిని అన్ని పార్టీల సహకారంతో తేజావత్ శివాజీ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివాజీ మాట్లాడుతూ నాపై నమ్మకంతో సర్పంచ్ గా ఏకగ్రీవంగా నాకు బాధ్యతలు అప్పగించిన అన్ని పార్టీల నాయకులకు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో అజయ్ తండా గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అజయ్ తండ ను ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.



# జిల్లా విస్తృత సమావేశమును విజయవంతం చేద్దాం

## టీఎస్ యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కంబాలపల్లి శ్రీను




**చౌటుప్పల్.డిసెంబర్ 19. ప్రభాత సూర్య:** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో డిసెంబర్ 21న జరిగే జిల్లా విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని టీఎస్ యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కంబాలపల్లి శ్రీను తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం జడ్పీ పి హెచ్ ఎస్ లో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలిసి కరపత్ర ఆవిష్కరణను గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. .అభ్యుదయ పోరాటాలకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయమైన వలిగొండ మండలంలో టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా విస్తృత స్థాయి సమావేశాలను జయప్రదం చేయడంలో ప్రతి ఒక్కరూ ముఖ్యపాత్ర పోషించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేటికరణ , సరళీకరణ ఆర్థిక విధానాల వలన పేద, మధ్యతరగతి వర్గాలకు కార్పొరేట్ విద్యపై ఉన్న భ్రమలు పతాక స్థాయికి చేరాయని అన్నారు. ఉద్యమాల ద్వారా తెచ్చుకున్న తెలంగాణలో కూడా ఉపాధ్యాయ సమస్యలు పేరుకుపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఓ.పి.ఎస్ ను రద్దుచేసి సిపిఎస్ ను పునరుద్ధరించాలని, ఎన్. ఈ.పి 2020 లో సమూలమైన మార్పులు చేయాలని,అందరికీ గుణాత్మక విద్య, సమానమైన విద్య, ప్రభుత్వ ఆధీనంలోనే అందించాలన్నారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రతి పాఠశాలలో నెలకొల్పాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక గది, ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు ఉండే విధంగా చూడాలని తెలిపారు. “ఉన్నత పాఠశాలలను మూసి వేయవద్దు-కొత్త పాఠశాలలు వద్దు” ఉన్నత పాఠశాలలోనే అన్ని ప్రమాణాలతో అభివృద్ధి చేసి విద్యార్థులకు అల్పాహారం వంటి అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గుణాత్మక విద్య అందే విధంగా కృషి చేయాలిని,సర్వీస్ రూల్స్ రూపకల్పన, 398 స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్, జూనియర్ లెక్చరర్స్,ఎంఈఓ, డిప్యూటీ ఇఓ పదోన్నతులు కల్పించుట, అన్ని పాఠశాలకు బోధనేతర సిబ్బందిని నియమించుట, మెరుగైన పిఆర్సి సాధన, 2003 డీఎస్సీ వారికి ఓ.పి. ఎస్ అమలు చేయుట, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం బడ్జెట్ను పెంచుట, పెండింగ్లో ఉన్న అన్ని డి ఏ లను చెల్లించుట,కేజీబీవీ లో పనిచేస్తున్న బోధన, బోధ నేతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఇచ్చుట, సాదారణ ఉపాధ్యాయుల మాదిరిగా సెలవులు వర్తింపజేయుట,సర్వీస్ రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం ఇచ్చుట, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు ఇవ్వడం, పదోన్నతులు, ఐదు యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయులకు శాస్త్రీయమైన టైం టేబుల్,పారిటీ స్కేల్ సాధన, అన్ని యాజమాన్యాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులకు ఉచిత హెల్త్ కార్డు ద్వారా అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సౌకర్యం అందించడం, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పకుండా వారి సేవలను బోధనకే పరిమితం చేయడం తదితర డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా భావిస్తూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమంలో అగ్రగామి సంఘంగా పని చేస్తుందని తెలిపారు.వలిగొండలో 2025 డిసెంబర్ 21న జరిగే జిల్లా విస్తృత సమావేశమును ఉపాధ్యాయులను చైతన్యపర్చుటకు విద్యా విషయక ఉపాధ్యాయ సంక్షేమం రూపకల్పన కావిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి వీ. నరేష్ , కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, ఎండి కాజా, క్రీడా కన్వీనర్ మట్టయ్య, ఉపాధ్యాయులు శోభారాణి, బాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ వ్యతిరేకులపై బిఆర్ఎస్ సస్పెండ్ వేటు

## చెరుకు లింగం గౌడ్, అశోక్ గౌడ్ లపై చర్యలు





బిఆర్ఎస్ పార్టీ – గ్రామ కమిటి
ఇందూర్తి మేటిచందాపురం

తేది: 16.12.2025

శ్రీయుత గా॥ మునుగోడు నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీ గా ॥ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గారికి నమస్కరించి వ్రాయునది ఏమనగా,

ఇందూర్తి మేటిచందాపురం బిఆర్ఎస్ పార్టీ నాయకులం, కార్యకర్తలం అందరం కలిసి ఈరోజు గ్రామ సభ నిర్వహించుకోవడం జరిగింది.

విషయం : — 1) తేది:11/12/2025 నాడు జరిగిన పంచాయతి ఎన్నికల గురించి చర్చ.
2) పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాటుపడినటువంటి చెర్కు లింగంగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు ఐతగోని అశోక్ గార్లను పార్టీ నుండి సస్పెండ్ చేయుట గురించి చర్చించడం జరిగింది.

అయ్యా !
మా గ్రామములో అన్ని కులాల నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులం కార్యకర్తలం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించుకోవడం జరిగింది. మన గ్రామ పంచాయతీ ఎన్నికలకు మునుగోడు నియోజకవర్గం ఇన్‌చార్జి గౌరవనీయులు శ్రీ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గారు పార్టీ సర్పంచి అభ్యర్థిగా ఏరుకొండ అబ్బయ్యను ప్రకటించారు.

పార్టీ క్యాడర్ మొత్తం పనిచేసినా ఒక రెండు కుటుంబాలు పార్టీ వ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడి, పార్టీ అభ్యర్థి 6 ఓట్ల తేడాతో ఓడిపోవడానికి కారణమయ్యారు. వారు చెర్కు లింగం గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు ఐతగోని అశోక్. వీరిద్దరిని పార్టీ నుండి సస్పెండ్ చేయవలసిందిగా గ్రామ సభలో తీర్మాణించడం జరిగింది. ఇట్టి మా తీర్మాణాన్ని మన్నించి వారిద్దరిపై చర్యలు తీసుకోవలసిందిగా మనవి.

ఇట్లు,
గ్రామ కమిటి,
ఇందూర్తి మేటిచందాపురం.

మర్రిగూడ(ప్రభాత సూర్య): గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం, భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) పార్టీ తన క్రమశిక్షణ వైఖరిని, కఠినంగా అమలు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. మేటిచందాపూర్ గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో, పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించిన చెరుకు లింగం గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఐతగోని అశోక్ గౌడ్లను, పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బిఆర్ఎస్ స్పష్టమైన సంకేతాన్ని పంపింది. ఈ నెల 11న జరిగిన ఎన్నికల్లో, బిఆర్ఎస్ పార్టీ తరపున ఏరుకొండ అబ్బయ్యను, మునుగోడు నియోజకవర్గ పార్టీ ఇంచార్జి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. అయితే పార్టీ అభ్యర్థిని కాదని, ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా వ్యవహరించడం ద్వారా, అంతర్గతంగా పార్టీ బలహీనపడిందన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ చర్యలే చివరకు అభ్యర్థి ఓటమికి దారితీశాయన్న భావన, పార్టీ శ్రేణుల్లో బలంగా వ్యక్తమైంది. ఈ పరిణామాలు గ్రామస్థాయిలో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయి. పార్టీపరువు, క్రమశిక్షణ దెబ్బతిన్నాయని భావించిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఈ నెల 16న జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో పార్టీ నిర్ణయాలను బేఖాతరు చేసిన వారిపై, కఠిన చర్యలు తీసుకోవాలంటూ విస్తృత చర్చ జరిగింది. పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా వ్యవహరించడం, కేవలం వ్యక్తిగత తప్పిదంకాదని, పార్టీ ఉనికికే ముప్పుగా మారుతుందన్న అభిప్రాయానికి సమావేశం చేరుకుంది. దీనితో ఇరువురిని పార్టీ నుంచి బహిష్కరించాలంటూ, ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామస్థాయి తీర్మానాన్ని మునుగోడు నియోజకవర్గ ఇంచార్జి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన అనంతరం, ఆయన ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణ కోణంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నియమాలు అందరికీ సమానమేనని, పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా వ్యవహరించడం అత్యంత తీవ్రమైన పార్టీ వ్యతిరేక చర్యగా భావిస్తామని స్పష్టం చేశారు. ఎంతటి పదవులు, హోదాలు ఉన్నా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే, చర్యలు తప్పవని ఆయన తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంతో చెరుకు లింగం గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఐతగోని అశోక్ గౌడ్లను, బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయం గ్రామ రాజకీయాల్లో మాత్రమే కాకుండా, మర్రిగూడ మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పార్టీ అంతర్గత విభేదాలకు తావులేకుండా, భవిష్యత్తు ఎన్నికలలో క్రమశిక్షణే, కీలక ఆయుధమన్న సంకేతాన్ని బిఆర్ఎస్ ఈ చర్య ద్వారా స్పష్టంగా పంపిందన్న విశ్లేషణ వినిపిస్తోంది. మొత్తంగా మేటిచందాపూర్ ఘటన, గ్రామస్థాయి ఎన్నికలైనా పార్టీ క్రమశిక్షణ విషయంలో, రాజీలేదన్న బిఆర్ఎస్ వైఖరికి ప్రతీకగా మారింది. ఇది రానున్న రోజుల్లో పార్టీ శ్రేణులకు హెచ్చరికగా, ప్రత్యర్థులకు రాజకీయ సందేశంగా నిలవనుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# జీ నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఇంధన సంరక్షణ వారోత్సవాలు






గండిపేట్, సూర్య ప్రతినిధి: నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన సంరక్షణ వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. అందులో భాగంగా మణికొండ జిల్లా పరిషత్ హై స్కూల్లో 9, 10 వ తరగతి విద్యార్థులకు ఇంధన సంరక్షణపై అవగాహన కల్పించి ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఇంధనాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం, విద్యుత్ ఆదా ప్రాముఖ్యత, భవిష్యత్తు తరాలకు ఇంధన వనరుల సంరక్షణ అవసరం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్లు రమణారెడ్డి, గౌతమి హాజరై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నాయకులు రవికాంత్ రెడ్డి, రాజేష్, నారాయణమ్మ కాలేజ్ విద్యార్థులు హాజరై మాట్లాడారు. ఇంధన సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న వయసు నుంచే ఈ విషయాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



# అనాసాగరం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

### అనాసాగరం సర్పంచ్ బొడ్డు రాంబాబు

### అనాసాగరం ఉపసర్పంచ్ గా షేక్ మధార్ సాహెబ్

**ఖమ్మం( సూర్య ప్రతినిధి):** నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామ సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఎం అభ్యర్థి బొడ్డు రాంబాబు అత్యధిక మెజార్టీతో గెలుపు పొందారు. షేక్ మధార్ సాహెబ్ ను ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 22 న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో అనాసాగరం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతామని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కరించి ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


### జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు.




**మెదక్ జిల్లా ప్రతినిధి - ప్రభాత సూర్య:** మెదక్ జిల్లా ఎస్పీ.డి. వి. శ్రీనివాస రావు ఈ నెల 21 వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, తక్కువ ఖర్చుతో, ఇరువైపుల సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు.రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులుక్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం & కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు అని వివరించారు.మెదక్ జిల్లా ఎస్పీ ప్రజలకు సూచిస్తూ చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని, రాజీ అంటే విజయం వైపు దారితీసే నిజమైన మార్గమాని పేర్కొన్నారు.న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.అదే విధంగా జిల్లా పోలీసు అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, కోర్టు విధులు నిర్వర్తించే కానిస్టేబుల్‌లు మరియు ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవాలనుకునే వారు సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

# బీజేఎంసీలో మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాలి

### కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్ గౌడ్



గండిపేట్, సూర్యా ప్రతినిధి: బండ్లగూడ జాగీర్ సర్కిల్ పరిధిలోని బైరాగిగూడ, గంధంగూడలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్ గౌడ్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 123 వ డివిజన్ బైరాగిగూడ, గంధంగూడ పరిధిలోని వివిధ కాలనీలో నీటి ఎద్దడికి చర్యలు తీసుకోవాలని హిమాయత్ సాగర్ సెక్షన్ టెక్నికల్ ఆఫీసర్ ఎల్లమయ్యను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా మంచినీటి సమస్య ఉందని, హిమాయత్ సాగర్ సెక్షన్ టెక్నికల్ ఆఫీసర్ ఎల్లమయ్యకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. కనీసం రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. గంధంగూడలోని శాఖరగుట్ట మీద నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంక్ ను వీలైనంత త్వరగా ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ మేరకు స్పందించిన టెక్నికల్ ఆఫీసర్ ట్యాంకు నిర్మాణం పూర్తై తుది పరిశీలన పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ ట్యాంకు ఉపయోగంలోకి వస్తే గంధంగూడ పరిసర కాలనీలో ఎండాకాలంలోనూ ఎటువంటి నీటి సమస్య ఉండదని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో రాములు, శ్రీనివాస్, బిజెపి నాయకులు మహేష్ కుమార్ యాదవ్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



## యూరియా కొనుగోలు ఇకపై బుకింగ్ యాప్ ద్వారానే స్టాక్ పారదర్శకత, దళారులను అరికట్టడమే లక్ష్యం... జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్

**మెదక్ ప్రతినిధి, (ప్రభాత సూర్య):** మెదక్ జిల్లాలో యూరియా ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సక్రమంగా అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై యూరియాను నేరుగా బుకింగ్ అప్లికేషన్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు నేటినుంచే యూరియా బుకింగ్ యాప్‌ను అధికారికంగా లైవ్ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కొత్త విధానం ద్వారా రైతులు తమ మొబైల్ ఫోన్ ఉపయోగించి ఇంటి నుంచే సులభంగా యాప్‌లో లాగిన్ అయి యూరియాను బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రిటైలర్ల వద్ద అందుబాటులో ఉన్న యూరియా బ్యాగుల ప్రస్తుత స్టాక్‌ను రియల్ టైమ్‌లో ఎవరైనా పరిశీలించుకునే సౌకర్యం కూడా ఈ యాప్‌లో ఉంటుందని తెలిపారు. దీంతో ఎక్కడ ఎంత స్టాక్ ఉందన్న సమాచారంపై స్పష్టత ఏర్పడనుంది. యూరియా బుకింగ్‌కు సంబంధించి అర్హత ప్రమాణాలను కూడా అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు. పట్టా భూ యజమానులు, రోఫర్ పట్టాదారులు, నాన్ పట్టా లేదా ఎన్డిఎస్ రైతులు, అలాగే కౌలుదారులు మాత్రమే యూరియా బుకింగ్‌కు అర్హులని వెల్లడించారు. రైతుల గుర్తింపును ధృవీకరించడంతో పాటు బుకింగ్ ప్రక్రియను భద్రంగా నిర్వహించేందుకు, పీపీబీతో లింక్ చేయబడిన మొబైల్ నంబర్‌కు వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) పంపించి నిర్ధారణ చేయనున్నారు. రిటైలర్లు యాప్‌లో నమోదు చేసే రియల్ టైమ్ స్టాక్ వివరాల ఆధారంగానే రైతులు యూరియా బ్యాగులను బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఒకసారి బుకింగ్ విజయవంతంగా పూర్తయితే, రైతు సూచన కోసం ప్రత్యేకమైన బుకింగ్ ఐడీ రూపొందించబడుతుంది. ఈ ఐడీ ఆధారంగా రిటైలర్ వద్ద యూరియా తీసుకునే వీలుంటుంది. అలాగే రైతు భూమిలో నమోదు చేసిన సాగు విస్తీర్ణాన్ని ఆధారంగా తీసుకుని, ఒక్కో రైతుకు ఎంతమేర యూరియా బ్యాగులు బుక్ చేసుకునే అవకాశం ఉందన్నది స్వయంచాలకంగా నిర్ణయించబడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు. ఈ విధానం ద్వారా యూరియా అక్రమ నిల్వలు, దళారీ వ్యవస్థ, నకిలీ విక్రయాలకు చెక్ పెట్టడంతో పాటు, నిజమైన రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులోకి రావడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మొత్తంగా యూరియా బుకింగ్ యాప్ అమలుతో జిల్లాలో ఎరువుల పంపిణీ వ్యవస్థలో స్పష్టమైన మార్పు రానుందని, రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుందని వ్యవసాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసు

### ప్రభాకర్ రావు కస్టోడియల్ పొడిగింపు

న్యూఢిల్లీ,డిసెంబర్ 19(ఆర్ఎన్ఎ): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరోవారం రోజుల పాటు పొడిగించింది సుప్రీం కోర్టు. డిసెంబర్ 25 వరకు కస్టోడియల్ విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. గురువారం ప్రభాకర్ రావు వారం రోజుల కస్టోడియల్ విచారణ పూర్తి అయిన విషయం తెలిసిందే. అయితే ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజులు విచారణ చేయాలని సుప్రీంకోర్టును సిట్ కోరింది. వారం రోజుల కస్టోడియల్ విచారణ రిపోర్ట్‌ను ఉన్నత న్యాయస్థానానికి సిట్ అందజేసింది. దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణను వారం రోజుల పాటు పొడిగింపుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 26న పోలీస్ కస్టడీ నుంచి ప్రభాకర్ రావును విడుదల చేయాలని.. తదుపరి విచారణ వరకు ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు, అవసరమైన మందులు తీసుకునేందుకు ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. కొత్త సిట్ ఏర్పాటుతో ట్యాపింగ్ కేసు మరింత వేగవంతంగా విచారణ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. సీపీ సజ్జనార్‌తో పాటు రామగుండం సీపీ అంబరి కిషోర్ ఝా కూడా సిట్‌లో ఉన్నారు. గతంలో వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్ధిపేట సీపీ విజయ్ కుమార్ కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మాదాపూర్ డీసీపీ రితి రాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డితో పాటు రవీందర్, వెంకట గిరి, కేఎస్ రావు, శ్రీధర్, నాగేందర్ రావుతో కొత్త సిట్ ఏర్పాటు అయ్యింది.

## ఐటి ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా

### రాయదుర్గలో భారీగా గంజాయి స్వాధీనం

హైదరాబాద్,డిసెంబర్ 19(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయిని అమ్ముతున్నా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట గంజాయి సరఫరా జరుగుతూ పట్టుబడటం పోలీసులకు సవాల్‌గా మారింది. తాజాగా నగరంలోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు.. గంజాయి సరఫరా చేస్తున్న సోహెల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి 17 కేజీల గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ (ఓఆఓం) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి తెచ్చి ఐటీ ఉద్యోగులకు నిందితుడు సోహెల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది.

## రాజకీయాల్లోకి రావాలని సౌజన్య స్వాతికి భరోసాను ఇచ్చిన దగ్గుపాటి పురందేశ్వరి, పరిటాల సునీత







**గండిపేట్, : సూర్య ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ప్రాంతంలో నూతనంగా హైదర్ గూడ డివిజన్ లో క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని స్థానికురాలు సౌజన్యకు ఆంధ్రప్రదేశ్ నుంచి దగ్గుపాటి పురందేశ్వరి, పరిటాల సునీతలు సూచించారు. ఈ మేరకు శుక్రవారం సౌజన్య స్వాతికి ఫోన్ చేసి గంట సేపు పలు కీలక విషయాలను వివరించారు. ఈ సందర్భంగా వారు సౌజన్య స్వాతితో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ వస్తే మీరు బరిలో ఉండాలని ఫోన్ కాల్ చేసి రాజకీయంలో ముందుకు వెళ్లాలని, తాము అందుకు అండగా ఉంటామని సూచించారు. సౌజన్య స్వాతికి ఫోన్ కాల్ చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజకీయంలో ముందుకు కొనసాగాలని, తాము అండగా ఉంటామని దగ్గుబాటి పురందేశ్వరి, పరిటాల సునీత తెలిపారు. సౌజన్యకు పలు సూచనలు హైదరాబాద్ స్థానికంగా ఉన్న ఓటర్లను ఏ విధంగా ఎడ్యుకేట్ చేయాలో వివరించారు. రాజకీయంలో మహిళలు ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం సౌజన్య స్వాతి మాట్లాడుతూ.. పరిటాల సునీత, దగ్గుపాటి పురందేశ్వరి స్ఫూర్తితోనే రాజకీయంలో వస్తామని సౌజన్య స్వాతి వాళ్ల అడుగుజాడల్లో నడుస్తామని తెలిపారు. హైదరాబాద్ లో ఉంటున్న రాయలసీమ కి సంబంధించి సంఘాలు ప్రాంతానికి సంబంధించిన నాయకులతో మమేకమై ప్రజలకు అండగా ఉంటానని వివరించారు. తనతో ఫోన్ మాట్లాడి ధైర్యం నింపినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## ఆస్ట్రేలియాలో కాల్పులతో హైదరాబాద్‌కు సంబంధం లేదు: డీజీపీ

**బోండీ బీచ్‌లో కాల్పులు జరిగిన సాజిద్ అక్రమ్**

**సాజిద్ అక్రమ్ హైదరాబాదీయే కానీ ఉగ్ర ఘటనతో నగరానికి సంబంధం లేదన్న శివధర్ రెడ్డి**

**1998లో ఉన్నతవిద్యాభ్యాసం కోసం వెళ్లి అక్కడే స్థిరపడినట్లు వెల్లడి**

ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో కాల్పులకు పాల్పడిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడే అయినప్పటికీ, ఆ ఉగ్ర ఘటనతో హైదరాబాద్‌కు సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆస్ట్రేలియాలో యూదులపై కాల్పులు జరిపిన వారిలో సాజిద్ అక్రమ్‌కు హైదరాబాద్ మూలాలు ఉన్నట్లు బయటపడింది. పాతబస్తీకి చెందిన అతడు 1998లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆస్ట్రేలియా వెళ్లి, అక్కడే యూరోపియన్ మూలాలున్న వెనెరా గ్రాసో అనే మహిళను వివాహం చేసుకొని స్థిరపడ్డాడు. సాజిద్‌కు హైదరాబాద్ మూలాలు ఉండటంతో, ఈ కాల్పుల ఘటనపై డీజీపీ మరోసారి స్పందించారు. 1998లో ఉపాధి కోసం ఆస్ట్రేలియా వెళ్లిన సాజిద్ అక్రమ్ ఆరుసార్లు భారత్ వచ్చాడని, ఆస్ట్రేలియాలోనే యూరోపియన్ యువతిని వివాహం చేసుకున్న తర్వాత 1998లో భార్యతో పాటు ఒకసారి హైదరాబాద్‌కు వచ్చాడని వెల్లడించారు. 2004, 2009, 2011, 2016లో ఆయన వచ్చాడని అన్నారు. 2016లో ప్రాపర్టీ సెటిల్‌మెంట్ కోసం వచ్చాడని, 2022లో చివరిసారి తల్లి, సోదరిని చూడటం కోసం వచ్చాడని తెలిపారు. కాగా, బోండీ బీచ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 16 మంది మృతి చెందారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై త్వరలో నిర్ణయం

**అందరితో చర్చించి ఓ నిర్ణయానికి వస్తాం**

**ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ వెల్లడి**

హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణం లో, ప్రజాస్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసనసభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తామని చెప్పారు. రాష్ట్రంలో 12,728 పంచాయతీలకు గాను 12,702 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగ్గా, ప్రజాస్వామిక బద్ధంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం, ప్రజలు స్వేచ్ఛగా తీర్పును ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ ఎన్నికల నిర్వహణలో అధికారులు స్వేచ్ఛగా పనిచేశారని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దామోదర రాజనర్సింహరు, ధనసరి అనసూయ సీతక్కలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రజల ముందుకు వెళ్లగా, తమకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజలు అందించిన ఆశీర్వాదం.. ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి వివరించారు.

## గణతంత్ర వేడుకల అతిథిగా యూరోపియన్ నేతలు?

న్యూఢిల్లీ: జనవరి 26వ న గణతంత్ర దినోత్సవ వేడుకలకు యూరోపియన్ యూనియన్ నేతలు రాబోతున్నట్టు సమాచారం. ప్రతి సంవత్సరం జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏదో ఓ దేశాధినేతని భారత్ ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. తొలిసారిగా బహుళ-దేశాల కూటమికి చెందిన నాయకులు భారత్ రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరుకాబోతున్నట్టు తెలుస్తోంది. యూరోపియన్ యూనియన్‌తో భారత్ అతిపెద్ద వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే దశలో ఉంది. అలాగే భారత్-ఈయూ మధ్య వ్యూహాత్మక భాగస్వామం ఉంది. ఈ నేపథ్యంలో 2026 జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాను ఆహ్వానించినట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో న్యూఢిల్లీలో భారత్-ఈయూ సమ్మిట్ జరగనుంది. దాదాపు అదే సమయంలో ఈ నాయకులు భారత్‌కు రాబోతున్నట్టు సమాచారం. భారత్-ఈయూల మధ్య చాలా కాలంగా ఉచిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి(ఎనిటతిజీ ఇజ స్గ!÷జీబితినీనిబ). వచ్చే ఏడాది జనవరిలో ఈ చర్చల్లోనూ పురోగతి సాధించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా అధిక సుంకాల నేపథ్యంలో యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందం గురించి భారత్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది.

## హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం పర్యటన




హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్ నాడు హుస్నాబాద్ పట్టణంలో స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి బైక్ నడుపుతూ మున్సిపాలిటీ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలిచారు. ముందుగా అంబేద్కర్ భవన్ ను పరిశీలించారు.. అక్కడ జరుగుతున్న సీసీ రోడ్లు డ్రైనేజీ పనులను పర్యవేక్షించి ఇప్పటికే పట్టణంలో శంకుస్థాపన చేసుకున్న రోడ్లు ,డ్రైనేజీ లు ,కమ్యూనిటీ హాల్ లు, జంక్షన్ ల అభివృద్ధి పనులను పరిశీలించడం జరిగింది. అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్,ఇతర అధికారులకు పలు సూచనలు చేసారు. పెండింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించి .. ఇంకా పట్టణంలో ఎక్కడెక్కడ రోడ్లు ,డ్రైనేజీ పనులు అవసరమున్నాయో ఆరా తీసారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకుని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు,జంక్షన్ ల సుందరీకరణ పనుల పై ఆరా తీసారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ నీ రాష్ట్రంలో ఆదర్శంగా ఉండేలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి అన్నారు.



# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

### అన్నదానం నిర్వహణ





**గండిపేట్, : సూర్య ప్రతినిధి:** బండ్లగూడ జాగీర్ గంధంగూడ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం అమ్మవారి అభిషేకం, అలంకరణను దివ్యంగా అమ్మవారిని ఆలయ అర్చకులు అలంకరించారు. ఉదయం 9 గంటలకు గణపతి పూజ, చండీహోమం సంకల్పం మొదలగునవి ప్రారంభమయ్యాయని వివరించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమావాస్య సందర్భంగా చండీహోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణచే ఆలయ ప్రాంగణం దైవత్వంతో నిండుకుందన్నారు. 13 అధ్యాయాలు, 700 శ్లోకాలతో కూడిన వేద పండితుల మంత్రోచ్ఛారణ దివ్యంగా జరిగింది. భక్తులందరూ మహిళలు ఆలయ కమిటీ సభ్యులు ఆర్యవైశ్య సంఘం నుంచి విచ్చేసిన సంఘ సభ్యులు దాదాపుగా 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాద స్వీకరించి వారి సంతోషం వ్యక్తం చేశారు. ఈ అన్నదానాన్ని కౌకుంట్ల వినయ్ కుమార్ జ్యోతి, కౌకుంట్ల ప్రవీణ్ కుమార్ శ్రీ వాణి, కౌకుంట్ల రమేష్ కుమార్, వంగేటి సురేష్ శిరీషలు నిర్వహించారు.

## శబరియాత్రను పూర్తి చేసుకున్న మల్లేష్ గుప్తకు సన్మానం



**గండిపేట్ : సూర్య ప్రతినిధి:** సువర్ణ భూమి శబరిమల మహాపాదయాత్రను పూర్తి చేసుకొని ఓరుగంటి మల్లేష్ గుప్త తిరిగి వచ్చారు. దీంతో కాటేదాన్ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి పాదయాత్రగా బయలుదేరి శబరిమల చేరుకోవడంతో స్వాములను బాబుల్ రెడ్డి నగర్ ఫ్రెండ్స్ యూత్ అసోయేషన్ తరుపన సన్మానించడంతో పాటు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సోమ శ్రీనివాస్, పల్లపు జగన్, సురేష్, రమేష్, లింగం అరుణ్, రవి, వాసవి దేవాలయం ఫౌండర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అర్థం శ్రీనివాస్ గుప్తా, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రెసిడెంట్ గుడిపల్లి శేఖర్ గు,ప్తా ఫౌండేర్ సభ్యులు సోమ అశోక్ గుప్తా, పూరి శ్రీనివాస్ గుప్తా, గంగూలీ నరసింహా గుప్తా, ఆర్యవైశ్య మండల సంఘం ప్రసిడెంట్ వనమాల సురేష్ గుప్తా, వల్లకొండ విజయకుమార్ గుప్తా, చిగుళ్ల పల్లి సత్యనారాయణ గుప్తా, పాండు గుప్తా, ఎస్. ప్రకాష్ గుప్తా, ప్రశాంత్ పంతులు తదితరులు పాల్గొన్నారు.



# అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్ట నివారణ

## ఈనెల 22 వ తేదీన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు






**మెదక్ జిల్లా ప్రతినిధి - ప్రభాత సూర్య:** ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్టాలను నివారించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం, ప్రకృతి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమ నిర్వహణ, వైపరీత్యాల నివారణ నిర్వహణ చర్యలపై సిఎస్ రామకృష్ణ రావు, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటి) అధికారులతో కలిసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ నెల 22 న విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ లను ఆదేశించారు. ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ నష్టాలు నిర్వహించడంతో పాటు, ఆస్తి నష్టాలు తగ్గించగలుతామని చెప్పారు. పరిస్థితులను అంచనా వేయగలిగితే నష్టాలను తగ్గించగలుగుతామని వివరించారు. వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని అన్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వైపరీత్యాల సమయంలో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. దాదాపు 35 శాఖలు సమన్వయంతో మెలగాలని తెలిపారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాల రియల్ టైమ్ సమాచారం ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమగు అన్ని సేవల టోల్ ఫ్రీ నంబర్ల సమాచారం ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలు అనేవి వైపరీత్యాల సమయంలో అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలోని ఎస్డిఆర్ఎఫ్ బృందాలకు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు సహకారం అందిస్తాయని తెలిపారు. అవసరమైతే అత్యవసర సమయాల్లో హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చు అని అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ అధికారులు విపత్తు నివారణ చర్యలపై పలు అంశాలను కూలంకషంగా చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, జిల్లాల్లో విపత్తుల నిర్వహణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని అన్నారు. ఈ నెల 22 న విపత్తు నిర్వహణపై మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహిస్తామని అన్నారు. ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణ పొందేలా అవగాహన కార్యక్రమాలు కల్పించామని చెప్పారు. గత వర్షాకాలం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించాయని తెలిపారు. ముందస్తు అప్రమత్తత, స్పష్టమైన ప్రణాళికలు, విపత్తుల అంచనా, ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాల సమన్వయ చర్యలు, అధికార యంత్రాంగం, ప్రజల సహకారం తో ఎటువంటి నష్టాలు లేకుండా వరదలను ఎదుర్కొన్నామని వివరించారు. మున్ముందు కూడా ఎటువంటి నష్టాలు కలుగకుండా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇటీవలి ప్రతి మండలానికి ఒకటి చొప్పున అత్యవసర సమయాల్లో ఉపయోగపడే వస్తువులతో కూడిన కిట్ ను అందించామని చెప్పారు. మరింత విస్తృతంగా ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్. నగేష్ జెడ్పి సీఈఓ ఎల్లయ్య డిఆర్డిఓ శ్రీనివాసరావు డిఆర్ఓ భుజంగరావు ఆర్డీవో రమాదేవి అదనపు ఎస్పి మహేందర్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఏ పార్టీలో ఉన్నాడో నియోజకవర్గ ప్రజలకు చెప్పాలి..




### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్..

### స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు..

### మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ కురుమ

**గండిపేట్ : సూర్య ప్రతినిధి:** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఏ పార్టీలో ఉన్నాడో తేల్చి చెప్పాలని నియోజకవర్గ ప్రజలతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి రుజువులు లేదంటూ స్పీకర్ తేల్చడంతో నియోజకవర్గ ప్రజల్లో మరింత అనుమానం మొదలయింది. శుక్రవారం మాజీ కౌన్సిలర్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ కురుమ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేను నిలదీశారు. ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ కురుమ మాట్లాడుతూ...స్పీకర్ నిర్ణయంతో నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాదని బహిర్గతమయిందన్నారు. మరి ఎమ్మెల్యే ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చెప్పిన తీర్పుల స్ఫూర్తిని పట్టించుకోకుండా..కేవలం ఇక్కడి కాంగ్రెస్ పార్టీ ఒత్తిడికి తలొగ్గి స్పీకర్ నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యకరం. స్పీకర్ తీర్పును భారాస పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది"అని ఎస్.వెంకటేష్ కురుమ తెలిపారు. స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టులాంటిదని,స్వయంగా ఎమ్మెల్యే తాను నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారామని మీడియాకు తెలిపారని,అయినా స్పీకర్ మాత్రం పార్టీ మారలేదని చెప్పడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. దమ్ముంటే కారు గుర్తు మీద గెలిచిన మీరు వెంటనే రాజీనామా చేసి,ఎన్నికల్లో పోటీచేసి గెలవాలని డిమాండ్ చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నాను అనుకుంటే ఈనెల 21వ తేదీన కేసీఆర్ అధ్యక్షతన జరిగే సీఎల్పీ ప్లీనరీ సమావేశానికి గులాబీ కండువా కప్పుకొని హాజరుకావాలన్నారు. ఒకవేళ హాజరు కాకపోతే,ప్రజలు ఆయనను పార్టీలో ఉన్నారని ఎలా నమ్ముతారని వారు ప్రశ్నించారు. ఒకవేళ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లో లేనట్లయితే,వెంటనే తన పదవికి రాజీనామా చేసి మళ్ళీ ప్రజల తీర్పుకోరాలని డిమాండ్ చేశారు. ప్రజలు తమ ఓటు ద్వారా ఇచ్చిన అధికారాన్ని గౌరవించాలని,లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో రాజేంద్రనగర్ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని నీరుగార్చిందని..పార్టీ ఫిరాయింపుల చట్టం పనికిమాలిన చట్టం కాంగ్రెస్ పార్టీ చెప్పిందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ చంపేసిందని విమర్శించారు. సమావేశంలో నాయకులు మైలార్ దేవ్ పల్లి డివిజన్ యూత్ అధ్యక్షులు అక్కెం రఘు యాదవ్, గంజి రాజు నేత, సూర్యం, తదితరులు పాల్గొన్నారు.....



# మణికొండను నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలి

### నాయకులు కుంభగళ్ల ధనరాజ్

**గండిపేట్ సూర్య ప్రతినిధి:** మణికొండ మున్సిపాలిటీని నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలని నాయకులు కుంభగళ్ల ధనరాజ్ అన్నారు. 90 వేల వరకు ఓటర్లు,దాదాపు రెండు లక్షలకు పై చిలుకు జనాభా ప్రజలు ఉన్న కేవలం మణికొండను రెండు డివిజన్లుగా విభజించడంపై మండిపడ్డారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులను కలిసి వినతపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణికొండ, నెక్నాంపూర్‌లు మాత్రమే చేయడం అన్యాయమని అన్నారు. కనీసం పుప్పాలగూడ, చిత్రపురిల పేర్లతో కలిపి మొత్తంగా నాలుగు డివిజన్లు చేయడం సబబని అన్నారు. తమ అభిప్రాయాలను తెలియపరిచారు. ఒక వేళ సాధ్యసాధ్యాలు కానీ పరిస్థితిలో కనీసం పుప్పాలగూడ పేరున ఒక డివిజన్ పెంచాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం మణికొండ పరిసర ప్రాంతాలలో పేరుగాంచిన అలకాపూర్ టౌన్ షిప్ తో పాటు వెంకటేశ్వరకాలనీ, ఈవీవీ కాలనీ, పోయినార్ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, గోల్కొండ హిల్స్,బ్లూ ల్యాగూన్, కోహినూర్ విలాస్, ప్లాటీలా, ఫుడ్ ల్యాండ్స్ విల్లాలు అన్ని నెక్నాంపూర్ పరిధిలో విరివిగా ఉన్నాయని, కావున నెక్నాంపూర్ పేరు మాత్రం మార్చవద్దన్నారు.

## లష్కర్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాల్సిందే : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్ : లష్కర్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాల్సిందేనని సనత్‌నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ధర్నా చౌక్‌లో లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ..200 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సికింద్రాబాద్ ప్రాంతాన్ని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలనేది ఈ ప్రాంత ప్రజల డిమాండ్ అన్నారు. మా ప్రాంతం నుంచి వచ్చే ఆదాయాన్ని మా ప్రాంత అభివృద్ధికే ఖర్చు చేయాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. ఈ పోరాటానికి మా సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీలో డివిజన్ల విభజన కూడా శాస్త్రీయంగా జరగలేదని ఆరోపించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మికి కూడా తెలవకుండా డివిజన్ల విభజన జరగడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి లష్కర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



# అమరావతి వర్సెస్ ఫ్యూచర్ సిటీ

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలు చెరో క్రొత్త నగరాన్ని నిర్మించే పనిలో ఉన్నాయి. ఏపీ ముఖ్యమంత్రి రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్మించే ప్రయత్నం గత ఆరేళ్లు గా చేస్తూనే ఉన్నారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాదును అనుకునే మరో నగరాన్ని సృష్టించడం కోసం చాలా కష్టపడుతున్నారు. ఒకప్పుడు ఒకే పార్టీలో ఉన్న ఈ ఇద్దరు ముఖ్యమంత్రులు తమ తమ డ్రీం ప్రాజెక్టులను సాకరం చేసే పనిలో పడ్డారు. రాజకీయంగా తెలంగాణ సీయం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యర్థులు పదేపదే తెలంగాణ మూవ్ మెంట్ సమయంలో ఆయన పాత్ర పై ప్రశ్నలు సంధిస్తూ ఉంటారు. వాటికి చెక్ పెట్టేందుకు తనదైన బ్రాండ్ ను ప్రమోట్ చేసేందుకు ఫ్యూచర్ సిటీ పేరుతో మరో కొత్త నగరాన్ని సృష్టించే పనిలో రేవంత్ పడ్డారు. హైదరాబాదును ఆడుకుహైదరాబాదును అనుకుని నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రమోషన్స్ కోసం ఇటీవల ఆయన ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ సమిట్ టాక్ ఆఫ్ ది స్టేట్ అయింది. ముందుగా ఫ్యూచర్ సిటీ కోసం 30 వేల ఎకరాల్లో దీన్ని నిర్మిస్తుండగా భవిష్యత్ లో దాదాపు లక్షా ఎనభై వేలకు పైగా ఎకరాల్లో విస్తరించే ఆలోచనలో ఉన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో నిర్మిస్తున్న ఈ నగరం ఔటర్ రింగ్ రోడ్, శ్రీశైలం రోడ్డు, నాగర్జున సాగర్ రోడ్ ల మధ్య శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు ఒక 30 కిమీ దూరం లో రానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు కు సైబర్ సిటీ, వైఎస్ ఆర్ కు ఔటర్ రింగ్ రోడ్ నిర్మాతలుగా పేరు ఉంది. ఇప్పుడు ఫ్యూచర్ సిటీ నిర్మాత గా గా తన పేరు ఉండాలని తెలంగాణ ప్రస్తుత సీయం రేవంత్ రెడ్డి ట్రై చేస్తున్నారు. ఈ సిటీ లో ఫార్మా, %ూా×%, ఎంటర్టైన్మెంట్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, హెల్త్ రంగాలను ప్రోత్సహించేలా 6 థీమ్ సిటీలను నిర్మించే ప్లాన్ చేశారు రేవంత్. ఇప్పటికే ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించే పనిలో పడింది తెలంగాణ ప్రభుత్వం. కనీసం 10 లక్షల మంది నివసించేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వానికి పెట్టుబడుల ఆకర్షణ పెద్ద కష్టం కాదు. హైదరాబాద్ పేరుతో ఆల్రెడీ ఎస్టాబ్లిష్ అయిన ప్రపంచ స్థాయి సిటీ వారికీ అండగా ఉంది. కేంద్రంపై మరీ ఎక్కువ గా ఆధార పడాల్సిన అవసరం రేవంత్ కు లేదు. ఈ క్రొత్త సిటీ నిర్మాణ పర్యవేక్షణ కు ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ ఆథారిటీ ని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఫ్యూచర్ సిటీ ని తెలంగాణ లోని అన్ని ప్రాంతాలతో డైరెక్ట్ గా కనెక్ట్ చేసే రోడ్లు రెడీ చేస్తున్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ని అమరావతి మీదుగా మచిలీపట్నం పోర్ట్ తో లింక్ చేసే గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కు కూడా ప్రయత్నాలు కొలిక్కి వస్తున్నాయి. 2028 ఎన్నికల టార్గెట్ గా ఫ్యూచర్ సిటీ తొలి దశ పూర్తి చేసే పనుల్లో సీయం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారు. ఏపీ రాజధాని నిర్మాత గా తనపేరు నిలబడి పోవాలని సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రయత్నం అమరావతి. మధ్యలో జగన్ ప్రభుత్వం ఉన్న 5ఏళ్ళు తీసేస్తే ఇప్పటికి అమరావతి పనులు మొదలై 6ఏళ్ళు అయింది. ప్రజల నుండి సేకరించిన 33వేల ఎకరాలకు తోడు మరో 23 వేల ఎకరాల వరకూ (ప్రస్తుతానికి) భూమి ల్యాండ్ పూలింగ్ లో తీసుకుని అక్కడ ప్రపంచ స్థాయి రాజధాని ని 9విభాగాలుగా (నవ నగరాలు ) కట్టాలని చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతానికి %జ=ణూ% బిల్డింగ్, అసెంబ్లీ, హై కోర్ట్, సచివాలయం (తాత్కాలికం ) మినహామిగిలిన బిల్డింగ్స్ ఏవీ రెడీ కాలేదు. క్వాంటం వ్యాలీ వస్తుంది అని చెబుతున్నా దాని స్వరూపం పై స్పష్టత రావాల్సి ఉంది. సమస్య ఏమిటంటే ప్రవేట్ పెట్టుబడులు అమరావతిలో ఇంకా పూర్తిగా కార్యరూరం దాల్చలేదు. కేంద్రం నుండి కూడా పూర్తి స్థాయిలో అమరావతి కి సాయం అందుతుందా అంటే లేదనే చెప్పాలి. ఇచ్చేదంతా అప్పుగానే ఇస్తున్నారు. పైగా ఏపీ కి రెవెన్యూ పరం గా అండగా నిలబడే హైదరాబాద్ లాంటి నగరం లేదు. అయినప్పటికీ చంద్రబాబు మొండిగా అమరావతి కోసం పోరాడుతున్నారు. ఏదేమైనా 2029 ఎన్నికలకు ముందుగానే అమరావతి కి ఒక రూపం తేవాల్సిన అవసరం పొలిటికల్ గా చంద్రబాబు పై ఉంది. ప్రస్తుతానికి అయితే ఒక మేర రేవంత్ ఫ్యూచర్ సిటీ పనులు కాస్త స్పీడ్ గా జరుగుతున్నట్టు కనిపిస్తున్నా చంద్రబాబు కూడా ప్రతికూల పరిస్థితుల్లోనూ తాను అనుకున్నది సాధించి తీరతారని ఆయన అభిమానులు కూటమి నేతలు అంటున్నారు

# ఆందోళనకరంగా రూపాయి పతనం !

**రోజురోజుకూ రూపాయి పతనం ఆందోళన కలిగిస్తోంది. అదేపనిగా దిగుమతులు పెంచుకోవడం, ఎగుమతులు తగ్గడం వంటి కారాణాలకు తోడు అంతర్జీతాయ పరిణామాల నేపథ్యంలో రూపాయి దిగజారుతోంది. ప్రపంచ మార్కెట్లో మన వస్తువుల ఉత్పత్తులు పెరిగితేనే మన విదేశీ మారక నిల్వలు పెరగడంతో పాటు, రూపాయి బలపడగలదు. అయితే గత దశాబ్దకాలంతో పోలిస్తే రూపాయి విలువ వందశాతం పడిపోయింది.**



ఇప్పుడు డాలర్‌తో పోలిస్తే 91 రూపాయలకు చేరింది. ఇది మనకు గుదిబండగా మారినా పెద్దగా స్పందన రావడం లేదు. ఆర్థికవేత్తలు, ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా దృష్టి సారించడం లేదా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి యధేచ్ఛగా దిగజారుతూనే ఉంది. మంగళవారం డాలర్ మారకంలో రూపాయి విలువ మరో 15 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 90.93 వద్ద స్థిరపడింది. అంతకు ముందు ఇంట్రాడేలో 36 పైసలు క్షీణించి జీవితకాల కనిష్ఠ స్థాయి 91.14 వరకు కూడా దిగజారింది. కేవలం 10 ట్రేడింగ్ సెషన్లలోనే డాలర్ మారకం లో రూపాయి 90 నుంచి 91 స్థాయికి పడిపోయింది. కేవలం ఐదు సెషన్లలోనే 1 శాతం మేరకు నష్టపోయింది. డాలర్ బలహీనత, క్రూడాయిల్ ధరల తగ్గుదల సైతం రూపాయి పతనాన్ని నిలువరించలేకపోయాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.54 శాతం దిగజారి 59.63 డాలర్లకు దిగివచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నెలలోనే రూపాయి 92 కన్నా దిగజారవచ్చని ఫారెక్స్ ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారత్ చేసిన కొత్త ప్రతిపాదనలను స్వీకరించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించలేదన్న వార్తలు రూపాయి మారకాన్ని ప్రభావితం చేశాయని ఫారెక్స్ ట్రేడర్లంటున్నారు. సరికొత్త ప్రతిపాదనలను భారత్ ఖరారు చేసే వరకు డీల్ నిలిచిపోయినట్టే అన్న భయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశా యి. మరోపక్క రూపాయి పతనాన్ని నిలువరించేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోవడం వల్ల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిధులు ఉపసంహరించడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టయింది. ఇదిలా ఉండగా 2027 జూన్ నాటికి రూపాయి 92-94 స్థాయికి దిగజారవచ్చని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ నీలకంఠ్ మిశ్రా అంచనా వేస్తున్నారు. అయితే రూపాయి ఎంత దిగజారినా మనం భయపడాల్సిందేమీ లేదన్నది ఆయన అభిప్రాయంగా ఉంది. మనం 68,500-69,000 కోట్ల డాలర్ల భారీ విదేశీ మారకపు నిల్వలతో అత్యంత శక్తివంతంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ ఏడాది డిసెంబరు 3వ తేదీ వరకు రూపాయి విలువ 5.1 క్షీణించిందని కేంద్రమంత్రి పంకజ్ వెల్లడించారు. రూపాయి విలువ ఇంతగా పడిపోవడానికి వాణిజ్య లోటే కారణమని ప్రభుత్వం చెబుతోంది. రూపాయి నిరంతర పతనం అంశాన్ని కొందరు సభ్యులు రాజ్యసభలో ప్రస్తావించగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదురి ఈ ప్రకటన చేశారు. ఈ ఏడాది రూపాయి విలువను వాణిజ్య లోటు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రభావితం చేశాయని మంత్రి చెప్పారు. రూపాయి విలువ క్షీణత వల్ల ఎగుమతి రంగం పోటీ సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. ఇదే సమయంలో దిగుమతుల విలువ పెరగవచ్చని కూడా ఆయన అంగీకరించారు. రూపాయి విలువను మార్కెట్ నిర్ణయిస్తుందని, దానికి ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించలేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే రూపాయి కదలికలను ఆర్‌బీఐ నిరంతరం ట్రాక్ చేస్తున్నదని, ఆటుపోట్లు తీవ్రంగా ఉంటే అవసరమైన మేరకు జోక్యం చేసుకుంటుందని ఆయన చెప్పారు. అయితే డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ మరింత క్షీణించే అవకాశం ఉందని, అయితే దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొందరు వాదిస్తున్నారు. ఫార్వర్డ్స్ మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం వల్ల సమస్య వస్తోందని, ఇంతకు ముందు

రూపాయిని ఒక స్థాయికి కట్టడి చేయడం ఒక తప్పిదమని పేర్కొన్నారు. గతంలో చేసిన తప్పిదాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయని తెలిపారు. ఇకపోతే ఇటీవలి కాలంలో అమెరికా తనకు గిట్టని దేశాలపై డాలర్‌తో బాదుతోంది. రష్యా, ఇరాన్, వెనెజువెలా దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించింది. డాలర్లు చిక్కకుండా చేసి, వాటి వ్యాపారాన్ని దెబ్బతీసింది. ఆ దేశాలను ప్రపంచ వాణిజ్యం నుంచి బయటికి పంపడానికి ఇదంతా చేసింది. రేపు తమకూ ఇలాంటి పరిస్థితే తలెత్తితే ఎలాగని ఇతర దేశాల్లో ఆందోళనతో కూడిన అనుమానం మొదలైంది. ఫలితంగా, డాలర్ మీద ఆధారపడటం తగ్గించి కొత్త మార్గాల్లో వాణిజ్యం చేసే ప్రయత్నం ఊపందుకొంటోంది. రష్యా కూడా చైనా, భారత్, కొన్ని ఆఫ్రికన్ దేశాల కరెన్సీలు, రూబుళ్లలో వ్యాపారం చేస్తోంది. భారత్ 30 దేశాలతో రూపాయితో జమలు, చెల్లింపులకు ఖాతాలు తెరచింది. అయితే రష్యాకు భారత్ చేసే ఎగుమతులకన్నా దిగుమతులే ఎక్కువ కావడంతో మన రూపాయలు రష్యన్ బ్యాంకుల్లో పేరుకుపోతున్నాయి. రష్యా భారత్ నుంచి ఎక్కువ దిగుమతులు చేసుకుంటే అవి ఖర్చయ్యేవి. కాకపోతే, ఆ రూపాయలతో భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉండటంతో, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్ ఇతర దేశాలతో రూపాయలు, స్థానిక కరెన్సీల్లో వ్యాపారం మొదలుపెట్టింది. సింగపూర్, యుఏఈ, నేపాల్, భూటాన్‌లలో యూపీఐ చెల్లింపులు ఊపందుకుంటున్నాయి. ఒక్కసారిగా డాలర్లకు దూరం జరిగితే చమురు, ఇతర దిగుమతుల ధరలు పెరిగిపోయి సామాన్యులు ద్రవ్యోల్బణం బారిన పడతారు. అందుకే డాలర్ ఆధిపత్యాన్ని క్రమక్రమంగా వదిలించుకోవాలని ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా బలమైన వాణిజ్యం దిశగా అడుగులు వేయాల్సి ఉంది. అంతకుముందే రూపాయిని బలోపేతం చేసుకుంటే మంచిది. ప్రపంచంలో ఇప్పటికీ 47శాతం లావాదేవీలకు డాలర్లనే ఉపయోగిస్తున్నారు. అందుకని, మరికొంత కాలం డాలర్ ఆధిపత్యం కొనసాగవచ్చు. ఆ తరవాత కూడా డాలర్ స్థానాన్ని ఏ ఒక్క దేశ కరెన్సీ ఆక్రమించకపోవచ్చు. స్థానిక కరెన్సీలు, డిజిటల్ కరెన్సీలు, బంగారం వాడకం పెరగవచ్చు.

## హడ్కో నుంచి 5 వేల కోట్ల రుణం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులను వేగవంతం చేస్తోంది. ఇందుకోసం హడ్కో నుంచి ప్రభుత్వం రూ. 5 వేల కోట్ల రుణాన్ని సమీకరించింది. ఈ నిధులతో నిలిచిపోయిన పాత బిల్లులను త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. వచ్చే మార్చి 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు గ్రీన్ చానెల్ ద్వారా ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్లలోకి డబ్బులు నేరుగా వెళ్లనున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక వనరుల కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుండి రూ. 5 వేల కోట్ల భారీ రుణాన్ని తీసుకుంది. ఈ నిధుల రాకతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల బిల్లులను త్వరలోనే వారి వారి ఖాతాల్లో జమ చేసేందుకు హౌసింగ్ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. బేస్మెంట్, స్లాబ్ మరియు ఫినిషింగ్ వంటి వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం ప్రతీ సోమవారం గ్రీన్ చానెల్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పంపిణీ చేయనుంది. నిధుల లభ్యత పెరగడంతో.. క్షేత్రస్థాయిలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని కలెక్టర్లు , ప్రాజెక్టు డైరెక్టర్లకు ఆదేశాలు అందాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు.. అంటే మార్చి 31 నాటికి లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.48 లక్షల ఇళ్ల పనులు కొనసాగుతుండగా.. ఇప్పటికే 60 వేల ఇండ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయి.

## ఏపీ సమస్యలపై తెలంగాణలో ఆందోళన...

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొందరు చేస్తున్న పనులు పార్టీకి చెడ్డ పేరు తీసుకొస్తున్నాయి. చాలామంది నేతలు ఏపీలో రాజకీయాలు చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ మాత్రం పక్క రాష్ట్రాల్లో చేస్తున్నారు. అధినేత జగన్మోహన్ రెడ్డి వారంలో మూడు రోజులు పాటు తాడేపల్లి కి వచ్చి పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. మిగతా నాలుగు రోజులు బెంగళూరుకు పరిమితం అవుతున్నారు. అయితే ఆయనను చూసి ఇప్పుడు కొత్తగా యాంకర్ శ్యామల లాంటి వారు సైతం ఏపీని తొంగి చూడడం లేదు. హైదరాబాదులో ఉంటూ ప్రత్యేక వీడియోలు విడుదల చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై అధికార ప్రతినిధి హోదాలో ఇలా వీడియోలు తీసి మీడియాకు అందిస్తున్నారు. సోషల్ మీడియాలో



పోస్టులు పెడుతున్నారు. అంతవరకు ఓకే కానీ.. ఏకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను సైతం హైదరాబాదులోనే.. అది కూడా తాను నివాసం ఉంటున్న కూకట్పల్లి ప్రాంతంలోనే నిర్వహిస్తుండడం మాత్రం కాస్త అతిగా మారుతుంది. సోషల్ మీడియావచ్చాక రాజకీయ పార్టీల తీరు మారింది. ఆ పార్టీ కార్యక్రమాల తీరు కూడా మార్చేశారు. ఎక్కడో విదేశాల్లో ఉంటే సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాకు జత చేస్తున్నారు. మెయిన్ మీడియా కూడా అదే వీడియోను ప్రసారం చేసి వారికి ఎనలేని ప్రచారం కల్పిస్తోంది. అయితే పెద్ద నేతలు వరకు ఓకే కానీ అధికార ప్రతినిధి హోదాలో.. పనిచేస్తున్న యాంకర్ శ్యామల లాంటి వారు కూడా ఇలా చేయడం ఏంటి అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక ప్రశ్న వినిపిస్తోంది. పైగా ఆమెకు ఆర్థిక ప్రయోజనం ఉందన్న టాక్ ఉంది. జీతాల రూపంలో సేవలు అందిస్తున్నారు అన్న మాట వినిపిస్తోంది. ఇటీవల పిన్నెల్లి బ్రదర్స్ అరెస్టయ్యారు. అయితే ఆమెకు ఆ విషయం తెలియదు అన్నట్టు ఉంది. వారు రెండు రోజుల క్రితం అరెస్టు అయితే.. ఆమె నిన్ననే కారుమూరి వెంకటరెడ్డి అనే నేత కలిసి కూకట్పల్లిలో ఆందోళన చేశారు. అంతకు ముందు కూడా ఆమె ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఒక ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు హైదరాబాదులో. అక్కడే సంతకాల సేకరణ చేపట్టారు. అయితే ఆమె ఏపీ రాజకీయాల గురించి మాట్లాడుతూ హైదరాబాదులో ఉంటున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం తన బుల్లితెర కెరీర్ ను వదులుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నుంచి కొంత మొత్తం జీతం అందుకుంటున్నారన్న టాక్ ఉంది. అందుకే కాబోలు హైదరాబాదు నుంచి తన రాజకీయాలను సాగిస్తున్నారు. అయితే తమకు అలాంటి అవకాశం కల్పించాలని ఇప్పుడు వైసీపీ నేతలు పార్టీ హై కమాండ్ ను కోరుతున్నారు. ఎక్కడో వ్యాపారాలు చేసుకుంటూ రాజకీయం చేస్తాము అంటూ సెటైర్లు వేస్తున్న వారు ఉన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.